క్లుప్తంగా

గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి



ఆలమూరులో గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ డీఈ

రుద్రవరం: అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని హౌసింగ్ డీఈ విజయ్‌బాబు లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని ఆలమూరులో వివిధ దశల్లో పనులు సాగుతున్న గృహాలను బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాజ్ యోజన గ్రామీణ్ కింద మంజూరై వివిధ దశల్లో ఉన్న వాటిని 2025 మార్చి ఆఖరు నాటికి పూర్తి చేసుకోవాలని చెప్పారు. బిల్లులు పెండింగ్ లేవని ఎప్పటికప్పుడు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఏఈ నాగరాజు, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్ ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

నంద్యాల(న్యూటౌన్): సేవ్ ఇండియా, సేవ్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక రైతు బజారు వద్దనున్న శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులకు బుధవారం ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్త ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘించడం వల్ల జరిగే పరిణామాలు, తల్లిదండ్రులు పిల్లలకు ద్విచక్రవాహనాలు ఇవ్వడం వల్ల కలిగే దుష్ఫలితాలను వివరించారు. అనంతరం విద్యార్థులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ భూపని విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆలయానికి అభిషేక పీఠం వితరణ



ప్రథమనంది ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన అభిషేక పీఠం

నంద్యాల(వ్యవసాయం): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ప్రథమనంది దేవస్థానానికి భక్తులు స్వామి వారి కైంకర్యాల కోసం అభిషేక పీఠం, ఆకాశ దీపాన్ని విరాళంగా అందజేశారని ఆలయ ఈఓ రామానుజన్, అర్చకుడు ప్రవీణ్ బుధవారం తెలిపారు. వారు మాట్లాడుతూ బాలాజీ కాంప్లెక్స్‌కు చెందిన రాచపల్లి లోకేశ్వర రెడ్డి, విజేత దంపతులు స్వామి వారి అభిషేకం కోసం రూ.30వేల విలువజేసే టేకు అభిషేక పీఠం, ఆకాశ దీపాలను అందజేశారని చెప్పారు.

వరిలో పంట కోత ప్రయోగం



నెహ్రూ నగర్‌లో వరిలో పంట కోత ప్రయోగం చేస్తున్న అధికారులు

గోస్పాడు: పంట కోత ప్రయోగాలతో దిగుబడులను అంచనా వేసేందుకు ఉపయోగకరంగా ఉంటుందని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు. మండలంలోని నెహ్రూ నగర్ గ్రామంలో బుధవారం వ్యవసాయాధికారి స్వప్నికారెడ్డి ఆధ్వర్యంలో పంట కోత ప్రయోగం చేశారు. డీఏఓ మాట్లాడుతూ రైతులు పైర్ల సాగు సమయంలో సరైన సస్యరక్షణ పద్ధతులు నిర్వహించాలని తెలిపారు. వరిలో పంట కోత ప్రయోగం నిర్వహించగా రాయల్ మైక్రో ఫుడ్ వాడి పొలంలో దిగుబడి ఎకరాకు 40బస్తాలు రాగా వాడని పొలంలో 43బస్తాల దిగుబడి వచ్చిందన్నారు. జిల్లాలో సరాసరి దిగుబడి 35 బస్తాలు వచ్చే అవకాశముందన్నారు.

నంద్యాల(అర్బన్): చాపిరేవుల గ్రామంలో రైతు శ్రీనివాసులుకు చెందిన వరి పొలంలో అధికారులు బుధవారం పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఏఎస్ఓ ప్రహ్లాద, సూపర్‌వైజర్ ఓబులేసు ఆధ్వర్యంలో నిర్ణీత కొలతల ప్రకారం ప్రయోగం నిర్వహించగా ఎకరాకు 36 సంచుల దిగుబడి లభిస్తుందని చెప్పారు. ఏఈఓ మణిమోహన్‌రెడ్డి, వీఆర్ఓ బాలన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ప్రైవేటు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయుడు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చాగలమర్రిలోని రాఘవేంద్ర పాఠశాలలో స్కూల్ బోర్డు, ఆట మైదానం లేకుండా, సీసీ కెమెరాల పర్యవేక్షణ లేక నడుపుతున్నప్పటికీ ఎంఈఓలు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఎయిడెడ్ పాఠశాల టీచర్‌తో ప్రైవేటు పాఠశాలలో బోధన చేయిస్తున్నారన్నారు. సురేష్, ఎర్రిస్వామి, సంతోష్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా భవనాలు

- కోటపాడులో గ్రామ సచివాలయం, ఆర్‌బీకే భవనాలను వినియోగించని వైనం

శిరివెళ్ల: లక్షలాది రూపాయాల నిధులతో నిర్మించిన గ్రామ పాలనా కార్యాలయాలు నిరుపయోగంగా మారాయి. చిన్న చిన్న సమస్యలతో కార్యాలయాలు వాడుకలోకి రాలేదు. మండలంలోని కోటపాడు గ్రామంలో రూ.42 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.21 లక్షలతో నిర్మించిన రైతుసేవా కేంద్రం 6 నెలల నుంచి నిరుపయోగంగా ఉన్నాయి. గత ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన భవన నిర్మాణాలు 99 శాతం పూర్తయయ్యాయి. అయితే విద్యుత్, తాగునీటి సమస్యలతో సచివాలయ సిబ్బంది నూతన భవనల్లో ప్రవేశానికి సుముఖత చూపడం లేదు. విద్యుత్ సదుపాయం లేకపోతే కంప్యూటర్లు పని చేయవు. అలాగే రైతు సేవా కేంద్రంలోనూ అదే సమస్య నెలకొంది. గ్రామ సచివాలయం పంచాయతీ కార్యాలయంలో కొనసాగుతుండంగా రైతు సేవా కేంద్రం మాత్రం అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. నెల నెలా రూ. 3 వేల ప్రభుత్వం అద్దె చెల్లిస్తుంది. కొత్త భవనంలోకి వస్తే ప్రభుత్వానికి అద్దె భారం తగ్గుతుంది. అలాగే సిబ్బందికి, ప్రజలకు మెరుగైన వసతులు, సేవలు అందుతాయి.



గ్రామ సచివాలయం

మందు బాబులకు అడ్డా..

కార్యాలయాలు నిరుపయోగంగా ఉండటంతో మందు బాబులకు అడ్డాగా మారింది. పశువైద్యశాలకు చెందిన స్థలంలో కార్యాలయాలు నిర్మించారు. నిర్మానుష్యంగా ఉండటం, ప్రహరీ లేకపోవడంతో సాయంత్రమైతే చాలు మందు బాబులు మద్యం సీసాలతో ప్రత్యక్షమవుతారు.



రైతు సేవా కేంద్రం

చర్యలు తీసుకుంటాం

కోటపాడులో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు సేవాకేంద్ర భవనాలను పరిశీలించి ఏఏ సదుపాయాలు లేవో గుర్తించి తదుపరి చర్యలు తీసుకుంటాం. వాటిని త్వరగానే వినియోగంలోకి తీసుకొస్తాం. ప్రభుత్వ భవనాలను నిరుపయోగం కానివ్వం. వెంటనే చర్యలు చేపడతాం.

– శివమల్లేశ్వరప్ప, ఎంపీడీఓ

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం



ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న గంగుల మనోహర్ రెడ్డి

శిరివెళ్ల: యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధశారం మినరల్ వాటర్ ప్లాంట్‌ను కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ గంగుల మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. చైర్మన్ కోరిక మేరకు మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి ప్లాంట్ ఏర్పాటుకు రూ.4 లక్షల సొంత నిధులను విరాళంగా ఇచ్చారు. ప్లాంట్ ఏర్పాటుకు సహకరించడంపై చైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కళాశాలలో ఫ్రెషర్‌డే ఘనంగా జరిగింది. ఆయన మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి తమ కుటుంబం పాటు పడుతుందన్నారు. విద్యార్థులు కూడా క్రమశిక్షణతో మెలిగి మంచి ఉత్తీర్ణత సాధించి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ ఇంద్రావతి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, వెంకటాపురం సర్పంచ్ కందుల ప్రసాదరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రీ సర్వే సమస్యలకు పరిష్కారం చూపాలి



మాట్లాడుతున్న సర్వే ఇన్‌స్పెక్టర్ శ్రీరామ్మోహన్

గోస్పాడు: రీ సర్వే సమస్యలకు పరిష్కారం చూపి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని నంద్యాల డివిజన్ సర్వే ఇన్‌స్పెక్టర్ శ్రీరామ్మోహన్ తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సర్వేయర్లతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలాల వారిగా రీ సర్వేకు సంబంధించిన సమస్యల పరిష్కారంపై రివ్యూ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలో ఉమ్మడి ఎల్‌పీఎం సమస్యలు 400, రైతుల పొలాల్లో విస్తీర్ణం తేడాల సమస్యలపై 700 దరఖాస్తులు అందాయన్నారు. వీటన్నింటిని ప్రత్యేకంగా ఆయా మండలాల గ్రామాల్లోని సర్వేయర్లు పరిష్కరిస్తారని చెప్పారు. గ్రామాల్లో సర్వేయర్లు పొలాల వద్దకు వెళ్లి పూర్తి స్థాయిలో పరిష్కారం చూపాలన్నారు. పని సమస్య అధికంగా ఉంటే టీంల ద్వారా కూడా వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులతో పాటు రైతులు తిరిగి ఇచ్చే దరఖాస్తులను కూడా పరిష్కరిస్తామన్నారు. డిసెంబర్ నెలాఖరులోపు రీ సర్వే సమస్యల పరిష్కారానికి సిబ్బంది ప్రణాళిక రూపొందించుకోవాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో ఏవైనా సమస్యలు తలెత్తితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని సరిచూసుకోవాలని కోరారు. సర్వేయర్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

గోస్పాడు: రీ సర్వే సమస్యలు పరిష్కరించాలని రైతుల నుంచి 1,385 దరఖాస్తులు అందాయని తహసీల్దార్ షేక్‌మొహిద్దీన్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు అందజేసిన దరఖాస్తులను స్థానిక రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించి ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలన్నారు. రెవెన్యూ సిబ్బంది, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

దొర్నిపాడు: రైతులు పంటలసాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏడీఏ సుధాకర్ సూచించారు. బుధవారం మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో పొలంబడి కార్యక్రమంలో భాగంగా రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. శనగ పంటలో తెగుళ్ల రావడం వల్ల పంట ఎండిపోతుందని రైతులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కొన్నేళ్లుగా పంటమార్పిడి చేయకపోవడంతో శనగ పంటకు తెగుళ్ల సోకుతున్నాయన్నారు. శనగ సాగుకు ముందు ఖరీఫ్‌లో ఇతర పంటలు సాగు చేయాలని సూచించారు. హెక్సాకోనజోల్, క్యాప్టన్ లీటరు నీటికి రెండు గ్రాములు కలిపి శనగ మొక్కల మొదలవల్ల పిచికారీ చేయాలని చెప్పారు. మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్ రెడ్డి, వీఏఏ రంగారెడ్డి, సర్పంచ్ శివరామిరెడ్డి, ఉప సర్పంచి మహేష్ పాల్గొన్నారు.

పల్లాకు తెగులు మొక్కలను తొలగించండి

రుద్రవరం: మినుము పంటలో పల్లాకు తెగులు మొక్కలు వెంటనే తొలగించి కాల్చి వేయాలని నంద్యాల జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి ప్రభావతి రైతులకు సూచించారు. మండలంలోని నర్సాపురం,ముత్తలూరు గ్రామాల్లో వ్యవసాయ శాఖ సిబ్బందితో కలిసి బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ..మినుములో పల్లాకు తెగులు మొక్కలను తొలగిస్తే తెగులు ఉధృతి తగ్గుతుందన్నారు. శనగ పంటలో వేరుకుళ్ల తెగులు నివారణకు పిచికారీ చేయాల్సిన మందులను సూచించారు. మొక్కజొన్న,పొగాకు పంటలను పరిశీలించి రైతులకు తెగుళ్ల నివారణ పద్ధతులను తెలియజేశారు. ఏఈఓలు రాజు,పహీమ తబస్సుం,ఆళ్లగడ్డ వ్యవసాయ సబ్ డివిజన్ ప్రాజెక్టు అధికారి హరిబాబు, వీఏఏలు ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల జిల్లా చిరు, వీధి వ్యాపారుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం స్థానిక మధుమణి సమావేశ భవనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, గౌరవ సలహాదారుగా న్యాయవాది రామచంద్రారావు, అధ్యక్షుడిగా మహబూబ్ బాషా, ప్రధాన కార్యదర్శిగా ఉమామహేష్, కో ఆర్డినేటర్లుగా రమేష్, శివరామిరెడ్డి, అజీజ్, వెంకటరమణ, కోశాధికారి అనిల్, సంయుక్త కార్యదర్శులుగా 15 మందిని ఎన్నుకున్నారు.

నేటి నుంచి ప్రత్యేక తరగతులు

ఉయ్యాలవాడ : పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ఆదేశాల మేరకు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ వీరప్రతాప్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గురువారం నుంచి మండల పరిధిలోని 5 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, మోడల్‌స్కూల్‌లో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు సబ్జెక్ట్‌ల వారీగా తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. సోమవారం తెలుగు, మంగళవారం సైన్స్, బుధవారం ఆంగ్లం, గురువారం గణితం, శుక్రవారం సోషియల్, శనివారం హిందీ సబ్జెక్ట్‌లపై ఆయా ఉపాధ్యాయులు తరగతులు నిర్వహిస్తారని వివరించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న, సహాయ కార్యదర్శి భాస్కర్ కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ ఏఓ రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు.వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ.20 వేల పెట్టుబడి సాయం అందజేయాలన్నారు. అన్ని పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, మండల కేంద్రాల్లో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన

నంద్యాల(న్యూటౌన్): యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో పట్టణ శివారులోని ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మత్తు పదార్థాల వినియోగం, అనర్థాలు, మహిళలపై లైంగిక వేధింపులు, మహిళలు, బాలికలు అక్రమ రవాణా, యూవ్‌టీజింగ్, సైబర్ క్రైమ్ అంశాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎక్సైజ్ సీఐ బ్రహ్మయ్య, వ్యక్తిత్వ వికాస నిపుణుడు సలీం బాషా పాల్గొని మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి, సిగరెట్లు, మత్తు పదార్థాలకు అలవాటైతే జీవితం అంధాకారమవుతుందన్నారు. డ్రగ్స్ సేవిస్తూ, అమ్ముతూ పోలీసులకు పట్టుబడితే ప్రభుత్వ ఉద్యోగాలు రావని, సమాజంలో చులకన అవుతారని అవగాహన కల్పించారు. కొత్త నంబర్స్ నుంచి ఫోన్ కాల్స్, మెసేజ్‌లు వస్తే స్పందించరాదని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

గోస్పాడు: పాఠశాలల పని వేళల మార్పును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఉపాధ్యాయ సంఘాల నాయకుడు రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ షేక్ మొహిద్దీన్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఉన్నత పాఠశాలల్లో అశాస్త్రీయమైన పని వేళలను మార్చాలనే ఆలోచనను ఉపసంహరించుకోవాలని కోరారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు బదులుగా ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 5గంటలకు పెంచుతూ పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాలోని ప్రతి మండలంలో రెండు పాఠశాలలో అమలు చేయాలని నిర్ణయించి అమలు ఉత్తర్వులు ఇవ్వడం ఎంత వరకు సమంజసమన్నారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చాగలమర్రి: ప్రభుత్వ పాఠశాలల పని వేళలు పెంపు ప్రతిపాదనలను విద్యాశాఖ అధికారులు ఉపసంహరించుకోవాలని ఎస్‌టీయూ, పీఆర్‌టీయూ సంఘాల నాయకులు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.శివశంకర్, జిల్లా కౌన్సిలర్ నారాయణమూర్తి, జిల్లా ఉపాధ్యక్షుడు మహబూబ్‌బాషా డిమాండ్ చేశారు. బుధవారం ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో ఎంఈఓ–2 న్యామతుల్లా, పెద్దబోధనం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు కాత్యాయనికి వినతి పత్రం అందజేశారు. నాయకులు ఐడీకే శాస్త్రి , హరినాథ్ రెడ్డి, సురేష్, భాస్కర్‌రెడ్డి, ఓబుళపతి, బాలస్వామి, ఇజాజుద్దీన్, సుబ్బారెడ్డి, సుబ్బారెడ్డి, హరిబాబు పాల్గొన్నారు.

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ పాఠశాలల్లో పని గంటలను మార్పు చేయాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఏపీటీఎఫ్ నంద్యాల జిల్లా శాఖ ఉపాధ్యక్షుడు జాకీర్‌హుసేన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యాశాఖ ఆదేశాలతో పైలెట్ ప్రాజెక్టు కింద నంద్యాల మండలంలోని ఉన్నత పాఠశాలల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు పెంచడం విద్యార్థులకు మేలు చేయకపోగా ఉపాధ్యాయులకు పని భారం ఎక్కువ అవుతుందన్నారు. శివయ్య, రామచంద్రారెడ్డి, భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మౌలాలి

నంద్యాల(న్యూటౌన్): పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుల స్థానంలో ఉపాధ్యాయులను కేటాయించి వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేపట్టాలని ఎస్‌టీయూ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మౌలాలి కోరారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధాన కార్యదర్శి అజాంబేగ్‌తో కలిసి మాట్లాడుతూ.. అనేక పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత ఉందని, పదవ తరగతి విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని.. పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుల స్థానంలో ఉపాధ్యాయులను కేటాయించకపోతే పదవ తరగతి పరీక్షల ఫలితాలపై ప్రభావం చూపుతుందన్నారు. నాయకులు నాగేంద్రకుమార్, సుబ్బయ్య, మహానంది పాల్గొన్నారు.

స్కూల్ బస్సును ఢీకొన్న టిప్పర్

- ఇద్దరు విద్యార్థులకు స్వల్ప గాయాలు

జూపాడుబంగ్లా: విజయవాణి స్కూలు బస్సును వెనుక నుంచి పీఎస్ఐ కంపెనీ టిప్పర్ ఢీకొనడంతో ఇద్దరు విద్యార్థులకు స్వల్ప గాయాలైన ఘటన బుధవారం మండలకేంద్రంలో చోటుచేసుకుంది. నందికొట్కూరు పట్టణంలోని విజయవాణి స్కూలుకు చెందిన బస్సు బుధవారం సాయంత్రం విద్యార్థులను వదిలిపెట్టేందుకు జూపాడుబంగ్లాకు చేరుకుంది. వ్యాను డ్రైవరు స్కూలు బస్సును రోడ్డుపైన నిలబెట్టి విద్యార్థులను బస్సులోంచి కిందికి దింపుతుండగా అతివేగంగా వచ్చిన పీఎస్‌కే టిప్పర్ వెనుక నుంచి ఢీకొంది. బస్సులో 30 మంది విద్యార్థులు ఉండగా 28 మంది క్షేమంగా బయటడ్డారు. ఇద్దరికి కడ్డీలు కొట్టుకొని స్వల్పగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని డ్రైవర్లను మందలించారు.



నంద్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

ఘనంగా టిప్పు సుల్తాన్ జయంతి

నంద్యాల(వ్యవసాయం): టిప్పు సుల్తాన్ జయంతి సందర్భంగా నంద్యాల ముస్లిం యూత్ ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక నడిగడ్డ నుంచి గాంధీచౌక్, నాగులకుంట రోడ్డు, సంజీవనగర్, శ్రీనివాసనగర్, ఆర్టీసీ బస్టాండ్ మీదుగా ర్యాలీ సాగింది. ఉమ్మడి కర్నూలు జిల్లా ఐయూఎంఎల్ అధ్యక్షుడు మౌలానా అబ్దుల్ సలాం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ బ్రిటీష్ వారిని ఎదురించి పోరాడిన గొప్ప నాయకుడని కొనియాడారు. ముస్లిం యూత్ నాయకులు ఎస్ఎండీ ఫయాజ్, సలాం మౌలానా, మజీద్‌ఖాన్, ఎస్‌డీపీఐ నాయకులు పాల్గొన్నారు.

వీఓఏలపై రాజకీయ వేధింపులు ఆపాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న వీఓఏలు

నంద్యాల(న్యూటౌన్): వీఓఏలపై రాజకీయ వేధింపులు ఆపాలని, రాజకీయ కారణాలతో తొలగించిన వీఓఏలను వెంటనే ఉద్యోగాల్లోకి తీసుకోవాలని, వీఓఏల మూడు సంవత్సరాల కాల పరిమితిని రద్దు చేయాలని స్థానిక కలెక్టరేట్ ఎదుట వీఓఏలు బుధవారం ధర్నా నిర్వహించారు.అంతకు ముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.ఏపీ వీఓఏల సంఘం అధ్యక్షుడు సోమన్న అధ్యక్షతన జరిగిన ధర్నా కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, వీఓఏ యానిమేటర్ల సంఘం రాష్ట్ర కోశాధికారి తిరుపతయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో 28వేల మంది వీఓఏలు పొదుపు సంఘాల మహిళలకు సేవలు అందిస్తున్నారన్నారు. నంద్యాల జిల్లాలో 200 మంది వీఓఏలను తొలగించారన్నారు. కొత్త ఉద్యోగాలు ఇవ్వాలి కానీ.. ఉన్న వారిని రాజకీయ కారణాలతో తొలగించడం తగదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి అలా తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి బాలవెంకట్, శివరాం, లక్ష్మీనారాయణ, శంకరయ్య, నాగవర్ధన్, మధుశేఖర్, గూండాలయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు





విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న డీఎస్పీ రవి కుమార్, విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీడీఓ

ఆళ్లగడ్డ: యువత పుస్తక పఠనాన్ని అలవర్చుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆళ్లగడ్డ డీఎస్పీ రవి కుమార్ అన్నారు. వారం రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎస్పీ హాజరై వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రత్నకుమారి పాల్గొన్నారు.

రుద్రవరం: గ్రంథాలయ వారోత్సవాలు ముగిశాయని నిర్వాహకులు సొరెడ్డి బుధవారం తెలిపారు. వారోత్స వాల సందర్భంగా వారం రోజుల పాటు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన,చిత్రలేఖనం,పరుగు,మ్యూజికల్ చైర్స్, తాడులాగడం వంటి పోటీలు నిర్వహించామన్నారు. ఆయా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులందరికీ స్థానిక గ్రంథాలయం వద్ద హెచ్‌ఎంలు దస్తగిరిరెడ్డి, సుదర్శన్ బహుమతులు అందజేశారు.

చాగలమర్రి: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, విద్యార్థులు గంథాలయాన్ని ప్రతి రోజు సందర్శించి విజ్ఞానాన్ని పెంచుకోవాలని ప్రధానోపాధ్యాయుడు శేషాద్రి సూచించారు. వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ప్రధాన ప్రాథమిక పాఠశాలలో లైబ్రరి నిర్వాహకుడు రామచంద్ర ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం, నృత్యం, వక్తృత్వం, వ్యాసరచన తదితర పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

ఉయ్యాలవాడ : సమాజాభివృద్ధిలో గ్రంథాలయాల పాత్ర కీలకమని ఎంఈఓ వీర ప్రతాప్‌రెడ్డి అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమం బుధవారం స్థానిక కార్యాలయంలో గ్రంథాలయాధికారిణి సంగీతలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పాఠ్యాంశాలే కాకుండా వివిధ రకాల పుస్తకాలు చదివే అలవాటు విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. మండల ఐక్య సంఘం అధ్యక్షురాలు ఉమామహేశ్వరమ్మ, ప్రధానోపాధ్యాయుడు ఆదాం, సిబ్బంది పాల్గొన్నారు.



రుద్రవరంలో విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న హెచ్‌ఎం

శిరివెళ్ల: గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని ఈఓ ఆర్డీ శ్రీనివాసశర్మ అన్నారు. వారం రోజులుగా జరుగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులను అందచేశారు. లైబ్రేరియన్ సుజాత, రిటైర్డ్ ఎంఈఓ మహబూబ్‌బాషా, హెచ్ఎం రామకృష్ణ పాల్గొన్నారు.

దొర్నిపాడు: పుస్తకాలు మంచి విజ్ఞానాన్ని ప్రసాదిస్తాయని ఎంపీడీఓ సావిత్రి సూచించారు. వారం రోజులుగా గ్రంథాలయాధికారి అఖిలాబేగం ఆధ్వర్యంలో జరుగుతున్న వారోత్సవాలు బుధవారం ముగిశాయి. ఈసందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన ఆటలు, వ్యాసరచన పోటీల్లో గెలిపొందిన బాలికలకు బహుమతులు అందజేశారు. ఎంఈఓ మనోహర్‌రెడ్డి, ఈఓపీఆర్డీ సులోచన పాల్గొన్నారు.

చిన్నారుల్లో గురకను నిర్లక్ష్యం చేయరాదు



అల్లూరులో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

ఉయ్యాలవాడ : చిన్న పిల్లల్లో గురకను నిర్లక్ష్యం చేయరాదని, ముక్కు వెనుక భాగంలో ఆడినాయిడ్స్ పరిమాణం పెరిగి అది పని చేసే శక్తిని కోల్పోయినప్పుడు ఇన్‌ఫెక్షన్ సోకి గురక, జలుబు వంటి శ్వాస ఇబ్బందులు కలుగుతాయని వైద్యాధికారి వెంకట సుబ్బయ్య తెలిపారు. బుధవారం మండలంలోని అల్లూరు గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా గ్రామంలో ఉయ్యాలవాడ ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది 104 వాహనంతో తరలివెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. దగ్గు, జలుబు, జ్వరాలతో బాధపడుతున్న 84 మందికి వైద్య సేవలు చేసి మందులు అందజేశారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో వైద్య సేవలు పొందాలని కోరారు. మధ్యాహ్నం నుంచి ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులు, చిన్నారులకు వైద్య పరీక్షలు చేశారు. సాయంత్రం దీర్ఘ కాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.